www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 8 జనవరి 2024

5

అన్నమయ్య



నేడు యథావిధిగా 'జగనన్నకు చెబుదాం'

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు ఉన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కోవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

ఎస్మా జిఒ ప్రతులు దహనం

27వ రోజూ కొనసాగిన సమ్మె

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 27వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగించారు. ఎస్మా ప్రయోగ జిఒ ప్రతులను దహనం చేశారు. పభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.



చిట్వేలి: ఎస్మా జిఒ ప్రతులను దహనం చేస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, అంగన్వాడీలు

చిట్వేలి : సిఐటియు ఆధ్వర్యంలో తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 27వ రోజుకు చేరింది. ఆదివారం చిట్వేలి ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు ఆధ్వర్యంలో అంగన్వాడీలు రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా జీవో కాపీలను తగలబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో పేరుతో భయపెట్టే ధోరణి మానుకోవాలని పేర్కొన్నారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వైపు ప్రభుత్వం చర్యలు చేపట్టపోతే తగిన మూల్యం చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు యదురురి సుజాత, పగడాల సుధామణి, బండారు శిరీష సుజన, శ్రీదేవి, రాధా, సులోచన, సిఐటియు మండల అధ్యక్షుడు కొత్త నాని, ఆయాలు కార్యకర్తలు పాల్గొన్నారు.
రాయచోటి టౌన్ : అంగన్వాడీల పై ఎస్మా ప్రయోగం అప్రజాస్వామిక చర్య అని సిఐటియు జిల్లా కోశాధికారి టి. హరిశర్మ అన్నారు. ఆదివారం రెండో రోజు దీక్షలు రాయచోటి అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టుప్రధాన కార్యదర్శి డి. భాగ్య లక్ష్మి అధ్యక్షతన ప్రారంభించారు. ఈ దీక్షకు జన విజ్ఞాన వేదిక, పౌరహక్కుల సంఘాల నాయకులు. అంగన్వాడీల మీద రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్మా ప్రయోగం అప్రజాస్వామిక చర్యగా జనవిజ్ఞాన వేదిక మరియూ పౌరహక్కుల సంఘాల నాయకులు యం.ప్రతాప్ రెడ్డి ఆర్. రవి శంకర్, పి. రెడ్డెయ్య లంబాడి హక్కుల సంఘం జిల్లా నాయకులు శంకర్ నాయక్ యస్ యస్ ఏ ఉద్యోగుల రమణ మహమ్మద్ అలీ, అంగన్వాడీల రిలే నిరాహారదీక్ష లో పాల్గొని సంఘీభావం తెలిపారు. కలికిరి చిన్నమండెం రాయచోటి మండలాల వర్కర్లు నిరాహారదీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి. రామాంజులు, లక్కిరెడ్డి పల్లి ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి యస్ ఓబులమ్మ, కలికిరి, గుర్రంకొండ ప్రాజెక్ట్ వర్కర్లు భూకైలేశ్వరి, లక్ష్మిదేవమ్మ, ఉమాదేవి విజయమ్మ, మస్తాన్ బి నందినితో పాటు పెద్ద ఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు. **మదనపల్లి :** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చెవిలో పువ్వులు పెట్టుకొని ఆదివారం 27రోజు నిరసన కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక కాంగ్రెస్ పార్టీ, జనసేన పార్టీలు తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మధురవాణి, రాజేశ్వరి మాట్లాడుతూ 27రోజులుగా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మదనపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ రెడ్డి సాహెబ్, జనసేన పార్టీ నాయకులు గంగారపు స్వాతి,మరియు ఆపార్టీ కార్యకర్తలు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శివరాం, అంగన్వాడీ కార్యకర్తలుగౌరీ, కరుణ, స్వరూపా, భూకైలేశ్వరి, అమ్మాజీ, విజయ, అభిరున్నిసా, బాగ్యా, గీతా సుజాని, శ్రీవాణి, ఈశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** అంగన్వాడీల సమస్యలు పరిష్కార అయ్యేంతవరకు సమ్మె కొనసాగిస్తామని ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి పేర్కొన్నారు ఆదివారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట 27వ రోజు చేరుకున్న అంగన్వాడీల రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షులు కార్యదర్శులు సుకుమారి ఓబులమ్మ ప్రభావతి సెక్టార్లు శ్రీవాణి నాగమణి నాగవేణి లక్ష్మీదేవి అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండయ్య

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ప్రజలందరికీ అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యం అందించడమే తమ లక్ష్యమని జిల్లా వైద్య అధికారి కొండయ్య పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో రాబోయే రోజులలో కోవిడ్, ఇతర వ్యాధులను రాకుండా ఉండడానికి ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.



అన్నమయ్య జిల్లాలో పిహెచ్‌సి, అర్బన్ హెల్త్ సెంటర్లు వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 47 పిహెచ్‌సిలున్నాయి. 11 అర్బన్ హెల్త్ సెంటర్లున్నాయి.

సీజనల్ వ్యాధుల పట్ల ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి శుక్రవారమూ డ్రై డే నిర్వహిస్తున్నాం. రోజూ గ్రామ, పట్టణాలలో పర్యటించి ప్రజలకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలింటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ?

ప్రజలు తమ ఇళ్ల ముందు నీటిని నిలువ ఉంచుకోకూడదు. టైర్లు టెంకాయలు వంటి వస్తువులను ఇంటి చుట్టూ ఉంచుకోకూడదు. మూడు రోజులు వరుసగా జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి, తగిన పరీక్షలు చేయించుకోవాలి. ప్రతి ఒక్కరూ కాచీ చల్లార్చిన వేడి నీటిని తీసుకోవాలి.

కరోనా కేసులు ఏమైనా నమోదు అయ్యాయి?

జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి కరోనా కేసులు నమోదు కాలేదు.

కోవిడ్ లక్షణాలను ఎలా గుర్తించాలి?

జ్వరము, తలనొప్పి, శరీర భారం, చలి, దగ్గు, జలుబు, గొంత నొప్పి, నీరసం, ముక్క నుండి నీరు కారుట, శాశ్వస సరిగా తీసుకోలేక పోవడం, కళ్ళు మంటలు, చెస్ట్ నొప్పి, రుచి వాసన తెలియక పోవడం. సరిగా నిద్ర పట్టక పోవడం వంటివి లక్షణాలు. కొందరికి వాంతులు, విరేచనాలు వస్తాయి. పై లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

కోవిడ్ నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయా?

కోవిడ్ వ్యాధికి కావలసిన మందులు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రములలో అందుబాటులో వున్నాయి.

కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలి. ఎప్పటి కప్పుడూ చేతులు శుభ్రం చేసుకోవాలి. జన సమూహములోకి వెళ్ళకుండా ఉండాలి. మాస్కులు తప్పక ధరించాలి. గుంపులు గుంపులాగా ఉండకుండా సామాజిక దూరం పాటించాలి. పోషక పదార్థాలు తీసుకోవాలి. రోజూ తప్పకుండా శారీరక శ్రమ (వ్యాయా మాములు) చేస్తూ తగిన విశ్రాంతిని కూడా తీసుకోవాలి.

ప్రజలకు ఏమైనా సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటున్నారా?

జ్వరము,దగ్గు, జలుబు, గొంతునొప్పి మొదలకు వ్యాధి లక్షనాలుంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కోరనా పరీక్షలు చేయించుకోవాలి. వృక్తిగత పరిశుభ్రత పాటించి, మాస్కూలు దరించి, చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి . అత్యవ సరము అయితే తప్ప ప్రయాణాలు చెయొద్దు. గుంపులు గుంపులుగా ఉన్న ప్రాంతానికి వెళ్లరాదు. సమదూరము పాటించాలి. కరోనా అని నిర్ధారణ అయితే జాగ్రత్తగా మందులు తీసుకొని, ప్రత్యేక గదిలో ఉండాలి. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. జాగ్రత్తలు తీసుకుంటే కరోనాను ధైర్యంగా ఎదుర్కోవచ్చు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకే సైన్స్ సంబరాలు : జెవివి

ప్రజాశక్తి - రాయచోటి

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకే చెకుముకి సైన్సు సంబరాలు నిర్వహిస్తున్నామని జెవివి జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ప్రభుచరణ్, ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని డైట్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని 30 మండలాలకు చెందిన 150 మంది విద్యార్థులు హాజరైయ్యారు. రెండు పాఠశాలలు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపికయ్యారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిన్నా ఫౌండేషన్ నిర్వాహకులు జిన్నా షరీఫ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి వివిధ రకాల పోటీ పరీక్షల్లో పాల్గొనాలని తెలిపారు. లక్ష్యం చేరుకునే వరకు ప్రయత్నాలు చేస్తూనే ఉండాలని తెలిపారు. ఇదే కార్యక్రమంలో అమెరికాలో నివాసం ఉంటున్న గౌతమ్ మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నచ్చిన రంగంలో బాగా కృషి చేసి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. జన విజ్ఞాన వేదిక వారు కార్యక్రమాలకు తన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి మొదటి స్థానంలో జీకే రాచపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. రెండవ స్థానంలో కలకడకు చెందిన ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు.మూడవ స్థానంలో ఏపీ మోడల్ స్కూల్ రాయచోటి వారు ఎంపికయ్యారు. ప్రయివేట్ పాటశాల లో మొదట స్థానంలో గాలివీడు రవిచంద్ర పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. రెండవ స్థానంలో ఓబులవారిపల్లి ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్ చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. మూడో స్థానంలో మదనపల్లికి చెందిన జ్ఞానోదయ పాఠశాల కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలో ప్రభుత్వ పాఠశాలల నుంచి జి.కె. రాచపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు హరీష్ రావురాజు ,తేజశ్రీ ,జూనేర ఎంపికయ్యారు. ప్రయివేట్ పాఠ శాల నుంచి రవిచంద్ర పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రశాంత్ రెడ్డి ,అఫ్తాబ్ , ప్రణవి ఎంపికయ్యారు వీరందరూ ఫిబ్రవరి 7 ,8 తేదీలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు వై.సి. రెడ్డెప్పరెడ్డి, శ్రీదేవి, అసదుల్లా బాష, నాగేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్ రెడ్డి ,గౌతమ్, గౌరవాధ్యక్షులు హరీంద్రనాథ శర్మ, కలాం ఫౌండేషన్ డైరెక్టర్ వినయ్ కుమార్, రౌఫ్ బాషా, ఆంజనేయులు, ప్రతాప్‌రెడ్డి, మధుసూదన్ రాజు ,శివారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, కిరణ్ కుమార్, జన విజ్ఞాన వేదిక నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న జెవివి నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-మదనపల్లి

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ శెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. ఈ సంధ్బంగా నరసింహ మాట్లాడుతూ ఆదివారం తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న శ్రీ చైతన్య, నారాయణ, మదనపల్లి జూనియర్‌కళాశాల, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు దగ్గరికి వెళ్లి తరగతులను మూసివేయించి విద్యార్థులను బయటకు పంపివేసినట్లు తెలిపారు. జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిర్వహిస్తామని అన్నారు. 9వ తేదీ నుంచి సంక్రాంతి సెలవులు ప్రారంభమవుతాయని, ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు సర్కులర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆదేశాలు లెక్కచేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళ కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.కార్తీక్, ఉపాధ్యక్షుడు రమణ, విష్ణు,గిరీష్, పవన్, కళ్యాణ్,మోహమ్మద్దిన్, హమీద్, ఇర్ఫాన్, ఫర్హాన్, అరిఫ్, సదిక్, సన్నీ, అహ్మద్, రాజేష్ పాల్గొన్నారు.

ఎపిపిగా వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జ్ కోర్టు పబ్లిక్ పాసిక్యూటర్‌గా దేవులపల్లి వెంకట్ రమణారెడ్డి బాధ్యతలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. మదనపల్లె కోర్టులో న్యాయవాదిగా ఉంటూా ఎపిపిగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు ఇన్‌ఛార్జిగా కూడా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. దేవులపల్లి వెంకటరమణారెడ్డికి సహచర న్యాయవాదులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

రేపు విసికె పార్టీ ఎమ్మెల్యేలు మదనపల్లెకు రాక

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక సిఎస్ఐ, జెసియం కమ్యూనిటీ హాల్‌లో విడుదలై చిరుతైగల్ కట్చి (విసికెపార్టీ) ఎన్నికల సన్నాహక సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ పేర్కొన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు విసికె పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు తమిళనాడుకు నుంచి వీసికే పార్టీ ఎమ్మెల్యేలు మహ్మద్‌షానవాజ్ (నాగపట్నం), ఎస్.ఎస్.బాలాజీ (తిరుపోరూర్)లు ముఖ్య అతిధులుగా హాజర వుతున్నారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్ వెలువ డనున్న నేపథ్యంలో పార్టీ కేడర్‌ను ఎన్నికలకు సన్నద్ధం చేయాలని కేంద్ర కార్యాల యం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీకి సూచనలు అందాయని తెలిపారు.

36 గంటల ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న పిఎఫ్ ఎపిజిఎల్ఐ పొదుపు సొమ్మును ప్రభుత్వం తన అవసరాల కోసం వాడుకుని, తమ అవసరాలు తీర్చడంలో విఫలమైందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ఆరోపించారు. ఆదివారం యుటిఎఫ్ భవన్ లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థికబకాయిల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ తాలూకా స్థాయిలో ఆరు గంటల ధర్నా, జిల్లా స్థాయిలో 12 గంటల ధర్నా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వంలో ఎటువంటి స్పందన లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు పిఆర్‌సి, డి ఎ బకాయిలు రూ.7,382 కోట్లు, కొత్త డిఎ బకాయిలు రూ.4884 కోట్లు, పిఎఫ్ లోన్లు పార్ట్ ఫైనల్ పేమెంట్లు రూ.1000 కోట్లు , ఎపిజిఎల్ఐ లోన్లు ఫైనల్ పేమెంట్లు రూ.330 కోట్లు, సరెండర్ లీవ్ లు రూ.4500 కోట్లు మొత్తంగా సుమారు రూ.18096 వేల కోట్ల బకాయిలు పెండింగ్ లో ఉంచిందని తెలిపారు. బకాయిల కోసం ఎప్పుడు ప్రతిపాదన చేసినా తరువాత నెలలో ఇస్తామని చెప్పడం తప్ప ఆచరణలో ఏ విధమైన పురోగతి లేదని చెప్పారు. ఆర్థిక బకాయిల చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే బకాయిలు చెల్లించాలని లేనిపక్షంలో విజయవాడలో జనవరి 9,10 తేదీలలో 36 గంటల ధర్నా చేపట్టనున్నామని తెలిపారు. విజయవాడలో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.

షోకాజ్ నోటీసులివ్వడం అన్యాయం : యుటిఎఫ్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు వెంటనే ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్, జాబిర్ డిమాండ్ చేశారు. డిఇఒ నోటీసులు ఇవ్వడాన్ని యుటిఎఫ్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయకుండా వారిని బెదిరించడం దుర్మార్గమైన చర్యని మండిపడ్డారు. వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లనే సమ్మెకు దిగారని అన్నారు. గత మూడు నెలలుగా కనీసం జీతాలు కూడా చెల్లించకుండా వారితో వెట్టిచాకిరి చేయించుకోవడం దారుణని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాలు చెల్లింపుకు బడ్జెట్ కేటాయింపులు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని చేస్తున్న సమ్మె న్యాయబద్ధమైనదని అన్నారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, జిల్లా సహాధ్యక్షులు శివా రెడ్డి, జిల్లా కోశాధికారి చంద్ర శేఖర్, జిల్లా కార్యదర్శులు అక్రమ్‌బాషా, వెంకట సుబ్బయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు విశ్వనాథరెడ్డి, గంగాదేవి పాల్గొన్నారు.

ముక్కా రూపానందరెడ్డిని కలిసిన అజయ్‌బాబు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రముఖ పారిశ్రామికవేత్త ముక్కారూపానందరెడ్డిని ముక్కా వారిపల్లెలోని తన స్వగృహంలో టిడిపి నాయకులు అజయ్ బాబు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అజయ్ బాబు మాట్లాడుతూ ఈసారి రైల్వే కోడూరు నియోజకవర్గంలో తమ సామాజిక వర్గానికి చెందినవారికే టిక్కెట్ కేటాయించాలని కోరారు. అజయ్ బాబు అనుచరులు మాట్లాడుతూ ఈసారి తమ ప్రియతమ నాయకులు అజయ్ బాబుకు అవకాశం కల్పిస్తే ఐకమత్యంతో ఆయనను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని, అధిష్టానంతో చర్చించి ఆయన అవకాశం కల్పించే విధంగా సహకరించాలని రూపానంద రెడ్డిని కోరారు. కార్యక్రమంలో అజయ్ బాబు సతీమణితో పాటు ఆయన అనుచరులు, అభిమానులు పాల్గొన్నారు.

21న నంది, జాతీయ సేవారత్న పురస్కారాలు

ప్రజాశక్తి-పీలేరు

వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తూన్న ప్రముఖులను గుర్తించి వారికి ఈ నెల 21న నంది, జాతీయ సేవారత్న పురస్కారాల ప్రధానం చేయనున్నట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్. సరోజనమ్మ తెలిపారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, అలంకరణ, ఇంద్రజాలం, క్రీడలు, నటన, కవిత్వం, వైద్యం, వాస్తు, జాతకాలు, సామాజిక సేవలు, జానపద గీతాలు రంగాల్లోని వారికి, కవులు, కళాకారులు, సంఘ సంస్కర్తలు, సినిమా, టివి కళాకారులు, దర్శకులు, నిర్మాతలు, రంగస్థల కళాకారులు, గాయనీ గాయకులు, సంగీత నృత్య కళాకారులు, విద్య, వైద్యం, న్యాయవాద, ఫ్యాషన్ డిజైనింగ్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఇతర రంగాలకు చెందిన విశిష్ట వ్యక్తులకు పురస్కారాలను అందిస్తామని చెప్పారు. అర్హత గల వారు తమ పూర్తి వివరాలతో దరఖాస్తును పూరించి, మొబైల్ నంబర్ 9705313061 కు వాట్సాప్ ద్వారా ఈనెల 12వ తేదీలోగా పంపాలని తెలిపారు.

బాలుర జూనియర్ హాకీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక బిటి కళాశాల హాకీ గ్రౌండ్‌లో ఆదివారం అన్నమయ్య జిల్లా హాకీ జట్టును ఎంపిక చేసినట్లు కోచ్ చంద్రశేఖర, కార్యదర్శి శివ ప్రసాద్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ హాకీ జట్టు ఎంపికకు దాదాపు 40 మంది హాకీ క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కోచ్ నౌషాద్‌బాషా, నరేష్‌బాబుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిపి.రాజు, పివి.ప్రసాద్ పాలగిరి ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు, జలజ, శివశంకర్ పాల్గొన్నారు.

రూ.పది లక్షలతో డ్రెయినేజీ నిర్మాణం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని మన్నెమడుగు పంచాయతీ లక్ష్మీపురంలో డ్రెయినేజీ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గత గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గ్రామస్తులు డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పది లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించారు. సర్పంచ్ శ్యామలమ్మ, ఎంపిటిసి సభ్యులు మహేష్, ఆధ్వర్యంలో డ్రెయినేజీ కాలువల నిర్మాణపు పనులు చేపట్టారు. పనులను ఆర్డబ్ల్యూఎస్ ఎఇ అశోక్ కుమార్ పరిశీలించారు.



హోత్రిశ్రీని సన్మానిస్తున్న సహ క్రీడాకారులు

స్పోర్ట్స్, గేమ్స్ మీట్ విజేతగా హోత్రిశ్రీ

ప్రజాశక్తి-పీలేరు

అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన 26వ ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్, గేమ్స్ మీట్ లో పీలేరుకు చెందిన టి. హోత్రిశ్రీ విజేతగా నిలిచింది. మూడు రోజుల పాటు నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 1,400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలో సింగిల్స్, డబుల్స్‌లో పీలేరుకు చెందిన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి హోత్రిశ్రీ అంగళ్లు, గోల్డెన్ వాలీ పాలిటెక్నిక్ కళాశాల తరపున ఆడి విజేతగా నిలిచింది. అ మార్చిలో కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించే సౌత్ జోన్ క్రీడలకు ఎంపికైంది. తిరుపతి సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీ నిర్మల్ కుమార్ ప్రియ, అనంతపురం జెఎన్‌టియు కళాశాల ప్రిన్సిపాల్ జయ చంద్రారెడ్డి చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంది. ఈ సందర్భంగా ఆదివారం ఆమెను సహ క్రీడాకారులు శాలువా కప్పి ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పట్టణ ప్రముఖులు రేఖ స్వరాజ్ రెడ్డి దంపతులు, సీనియర్ క్రీడాకారులు రాచపల్లి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక విద్యార్థులకు కూడా క్రీడలు అవసరమేనని అన్నారు. జాతీయ క్రీడాకారుడు, కోచ్ టి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తన కుమార్తె అంతర్జాతీయ స్థాయికి వెళ్లాలంటే ప్రభుత్వం తరపున చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అకాడమీ సభ్యులు హనీఫ్, వేణుగోపాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, రెడ్డి శేఖర్ రెడ్డి, రెడ్డి వారది, ముని ప్రసాద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం మానుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి కాంగ్రెస్ పై కుట్ర పూరితంగా తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని డిసిసి అధ్యక్షుడు షేక్ అల్లాబకష్ అన్నారు. ఆదివారం తమ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ వై.ఎస్. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేయడంతో, వైసిపిపై ప్రజా వ్యతిరేకత తారస్థాయికి చేరడంతో సజ్జల మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆయన చెప్పారు. 2009లో కీ.శే. ముఖ్య మంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించినప్పుడు కాంగ్రెస్ పై చెయ్యని ఆరోపణలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటున్న సమయంలో చేయడం నీచ రాజకీయాలకు నిదర్శనం అన్నారు. రాజశేఖర్ రెడ్డి మరణించినప్పుడు ఒక ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆస్తులను ధ్వంసం చేసి మళ్లీ అదే సంస్థ వారికి రాజ్యసభ పదవులను కట్టపెట్టుటలో ప్రముఖ పాత్ర వహించిన వారు ఎవరో ప్రజలందరికి బాగా తెలుసని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఫిక్, డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్ బాషా, కిసాన్ సెల్ అధ్యక్షుడు చెన్నకృష్ణ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖాదర్ వలీ, పట్ట అధ్యక్షుడు ఖాదర్ ఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

సంక్షేమ లబ్ధితో ఆర్థికాభివృద్ధి : 'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి, ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చింతపర్తి, చారా వాండ్లపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయాలు, ఆర్‌బికె కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లను ఆయన ప్రారంభించారు. అనంతరం చింతపర్తి పురవీధుల్లో ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డితో కలసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న వైసిపి ప్రభుత్వం పట్ల ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని, రానున్న ఎన్నికలలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి మళ్లీ సిఎం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష వంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ, మందులు అందిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పౌరసేవలు అందిస్తున్న ప్రభుత్వానికి మీ ఆశీస్సులు అందజేయాలని కోరారు. మండలంలోని చారా వాండ్లపల్లికి చెందిన నరసింహులు, నాగరాజ, బాలాజీ, ఆదినారాయణ, లక్ష్మిదేవి ఎమ్మెల్యే వైసిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి వైసిపి కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం మండలంలోని చింతపర్తిలో ఇళ్లు లేని నిరుపేదలకు 116మంది లబ్ధిదారులకు జగనన్న కాలనీ ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. అలాగే 50 మందికి అసైన్‌మెంట్ పట్టాలను అందజేశారు. అనంతరం వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - రాయచోటి

తిరుపతిలోని టిపిపిఎం పాఠశాలలో ఆదివారం జిల్లా ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర ఫిజికల్ సైన్స్ టీచర్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ టి మోహన్ బాబు, గౌరవ సలహాదారులు నరోత్తం రెడ్డి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. సమావేశానికి హాజరైన జిల్లా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల ఫిజికల్ సైన్స్ టీచర్లు అంతా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షులుగా ఎం భాస్కరన్, ప్రధాన కార్యదర్శిగా బి ప్రకాష్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా ఎస్ ఆంజనేయులు, ఆర్థిక కార్యదర్శిగా పి.ఎల్.ఎన్ శాస్త్రి, రాష్ట్ర కార్యదర్శులుగా కె. మురళీధర్, భోగ వెంకటసుబ్బయ్య, మహిళా కార్యదర్శిగా ఉషారాణి, ఉపా ధ్యక్షులుగా కె. రమేష్ రెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శులుగా సుబ్రహ్మణ్యం, జగన్ మోహన్ రెడ్డిని, డివిజనల్ కార్యదర్శులుగా ఎస్ అఫ్రోజ్, ఎన్ రాజయ్య,ఎం రవి ప్రతాప్, పి రెడ్డి శేఖర్ రెడ్డి, గౌరవ సలహాదారులుగా వెంకట శివయ్య, శివ ప్రసాద్, విష్ణువర్ధన్ రెడ్డి, అన్వర్ సాదత్, గంగాధర్, భాస్కర్, వరప్రసాద్ లను ఏకగ్రీవగా ఎన్నికయ్యారు. జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.



ట్రెక్కింగ్ నిర్వహించిన మిట్స్ ఎన్‌సిసి విద్యార్థులు

హార్సిలీహిల్స్‌లో 'మిట్స్' విద్యార్థుల ట్రెక్కింగ్

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సిసి విద్యార్థులకు హార్సిలీహిల్స్‌లో ట్రెక్కింగ్ నిర్వహించినట్లు లెఫ్టినెంట్ ఎన్.నవీన్ కుమార్ తెలిపారు. దేశ రక్షణ కోసం అత్యవసర సమయాల్లో ప్రతి ఒక్కరినీ కాపాడేందుకు వీలుగా కేడెట్స్‌కు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వంద మంది ఎన్‌సిసి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆసక్తికంగా పాల్గొన్నారని అన్నారు. విద్యార్థులకు రోప్ హ్యాండ్లింగ్, హిల్ క్లిబింగ్‌పై శిక్షణను అందించామని అన్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభించి 11 గంటలకు చేరుకున్న తెలిపారు. ఎన్‌సిసి సి, బి సర్టిఫికేట్లపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శాశ్వత శిక్షకులు హవల్దార్ ఎం.ఎం.నాయుడు, ఎ.పటేల్ పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రామాపురం

లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు వ్యవస్థాపక అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి తెలిపారు. దాత రాజేశ్వరి మాట్లాడుతూ డి.వి.రమణయ్య 23వ వర్థంతి పురస్కరించుకొని ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వంశీకృష్ణ,భారతి, దేవీకృతిక, వెంకట కృష్ణసాయి,ఆశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం జగన్‌ను ఎదుర్కోలేక కుళ్లు రాజకీయాలు

ప్రజాశక్తి-రామాపురం

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా ఎదుర్కోలేక చంద్రబాబునాయుడు కుళ్లు రాజకీయాలకు పాల్పడుతున్నారని వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి షేక్ జాకీర్‌హుస్సేన్ విమర్శించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు జరిగిందని అన్నారు. చంద్రబాబు, పవన్‌లు కుతంత్ర రాజకీయాలు చేస్తూ రాష్ట్రంలో అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకొని గెలవాలని చూస్తున్నారని అది సాధ్యం కాదని అన్నారు. 175 నియోజక వర్గాల్లో గెలుపే లక్ష్యంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి 2024 ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని, మరల సిఎంగా జగన్‌మోహన్‌రెడ్డే ఉంటారని ధీమా వ్యక్తం చేశారు.

జింకను కాపాడి అటవీ అధికారులకు అప్పగింత

ప్రజాశక్తి-బి.కొత్తకోట



గాయపడిన జింక

కుక్కల దాడి నుంచి జింకను కాపాడి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. పెద్దతిప్పసముద్రం మండలం, మడుమూరు సమీపాన రోడ్డు దాటుతున్న జింకపై కుక్కలు దాడి చేయడంతో గాయపడింది. అటుగా వెళుతున్న మోడల్ స్కూల్ చైర్మన్ చీకుర్తి శంకర్‌రెడ్డి, తదితరులు కుక్కలు దాడి నుంచి జింకను కాపాడారు. అనంతరం వైద్య సేవలు అందించి మలకల చెరువు అటవీశాఖ అధికారి హనుమంతుకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ సంపదను, వన్య ప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు.

'సజ్జల' వ్యాఖ్యలు దుర్మార్గం

ప్రజాశకి- రైల్వేకోడూరు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీపైన చేసినటువంటి దుర్మార్గపు వ్యాఖ్యలను ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజబోయిన శ్రీకాంత్ అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడలేక మద్దెల ఓడు అన్న రీతిలో జగన్ ప్రభుత్వం తన చేతగానితనాన్ని, ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికి మరోసారి మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణాన్ని తన రాజకీయ అవసరం కోసం వాడుకోవాలని చూడటం సిగ్గుచేటన్నారు. అటువంటి నీచ శవ రాజకీయాలు కాంగ్రెస్ పార్టీ ఎన్నటికీ చేయదన్నారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధానమంత్రిగా, రాష్ట్రంలో వై.ఎస్. షర్మిల ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామంలోని జిల్లావాండ్లపల్లె దగ్గర మాండవ్య నది ఒడ్డును ఉన్న పురాతనమైన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పునర్నిర్మాణానికి ఆదివారం ఉదయం 11 గంటలకు వేద పండితులతో భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒ కొండారెడ్డి, డిఇ గంగయ్య, డిప్యూటీ తహశీల్దార్ తిమ్మారెడ్డి, కాంట్రాక్టర్ సహదేవరెడ్డి, అర్చకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సిఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న వెంకటరెడ్డి

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని వైసిపి సీనియర్ నాయకులు చలిమామిడి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సహకారంతో మండలంలోని గట్టులో అనారోగ్యంతో ఉన్నపి. షబ్రున్నీషాకు సిఎం సహాయనిధి రూ.1.30లక్షలు మంజూరు చేయించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సిఎం సహాయనిధి చెక్కును వెంకటరెడ్డి అందించారు. కార్యక్రమంలో గట్టు సర్పంచ్ ఉమామహేశ్వరి, లక్ష్మీనారాయణ, గట్టు మాజీ సర్పంచ్ ముబీనా, మియాసాబ్, సచివాలయం కన్వీనర్ సికిందర్‌బాషా, నాయకులు దేసుగారి రామాంజినేయులు,ఖాదర్ వల్లి,నియోజకవర్గం సోషియల్ మీడియా కో– కన్వీనర్ యస్ తన్వీర్,జబీవుల్లా,అరిఫ్,సయ్యద్ బాషా,ఫాయజ్ బాషా,ఖాదర్ బాషా,మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సమాజంలో అందరూ బాగుండాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అందరూ బాగుండాలని, అప్పుడే అది సమసమాజం అనిపించుకుంటుందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. ప్రొద్దుటూరులోని ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోషియేషన్ కార్యాలయానికి 10 సెంట్ల స్థలపత్రాన్ని ఆదివారం అందజేశారు. కార్యాలయానికి స్థలం లేదని సహకరించాలని గతంలో సంఘ సభ్యులు ఎమ్మెలేయను కోరారు. వెంటనే స్పందించిన రాచమల్లు కామనూరు రోడ్డులోని అంజనేయస్వామి దేవాలయం ఎదురుగా 10సెంట్ల స్థలాన్ని రూ.40లక్షలకు కొని ఆ పత్రాన్ని వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల వారుంటారని, వారి సంక్షేమం తన బాధ్యతగా తీసుకున్నానన్నారు. ఫోటోగ్రాపర్లు వీడియోగ్రాఫర్లు ఈ కార్యాలయం ద్వారా ప్రయోజనం పొందాలన్నదే తన ఆలోచన అన్నారు. అనంతరం సంఘ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారంటీ'కి అనూహ్య స్పందన :'బత్యాల'

ప్రజాశక్తి-ఒంటిమిట్ట



మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయుడు

బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీకి ప్రజల నుంచి అన్యూహ్య స్పందన లభిస్తోందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఒంటిమిట్ట మండల పార్టీ అధ్యక్షులు గజ్జల నరసింహారెడ్డి అధ్యక్షతన గ్రామ కమిటీ అధ్యక్షులు పత్తి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన బాబుష్యూరిటి–భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమానికి బత్యాల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి వార్డులో ఇంటింటికి పర్యటించి భవిష్యత్తుకు గ్యారెంటీ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక బహిరంగ సభలో బత్యాల మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే అన్నదాత పథకం కింద రాష్ట్రంలోని లోని ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సహాయం, తల్లికి వందనం, మహాశక్తి, దీపం, మహిళల ఉచిత బస్సు ప్రయాణం, బిసిల రక్షణ చట్టం, ఇంటింటికీ మంచి నీరు, ఐదేళ్లలో పేదల ఆదాయాన్ని రెట్టింపు చేసి పూర్‌టురిచ్ నినాదంతో పేదలను సంపన్నులు చేయడమే చంద్రబాబు లక్ష్యమన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఈ నాలుగున్నరేళ్ళలో చేసిన అభివృద్ధి ఏంటో చూపాలని అన్నారు. ఇసుక దోపిడీతో అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి 43 మంది జల సమాధి అవ్వడానికి కారణమయ్యారని, పింఛా డ్యాం రెండుసార్లు తెగిపోయిన నేటికీ చర్యలు లేవని అన్నారు. మేడా నిర్లక్ష్యం కారణంగానే 500 పడకల వైద్య కళాశాల మదనపల్లికు తరలిపోయిందని, రాజంపేట ప్రాంతంలో వైద్య కళాశాల ఏర్పడి ఉంటే వేలాదిమంది తిరుపతికి వెళ్లాల్సిన అవసరం వచ్చేది కాదని అన్నారు. జిల్లా కేంద్రం రాయచోటికి తరలి వెళుతుందని ముందుగా తెలిసినప్పటికీ అడ్డుకునే ప్రయత్నం చేయకపోగా జిల్లా కేంద్రం సాధన ఉద్యమంలో కూడా పాల్గొనక పోవడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర ప్రజలు టిడిపి–జనసేన నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, రానున్న ఎన్నికలలో టిడిపి విజయకేతనం ఎగురవేసి నియోజకవర్గంలో సమస్యలన్నీ పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మోదుగుల పెంచలయ్య, మండల క్లస్టర్ ఇంచార్జ్ పుత్తా రామచంద్రయ్య, మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ జిలాని, డాక్టర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పసుపులేటి కృష్ణ, యూనిట్ ఇంచార్జ్ మావిళ్ల ఈశ్వరయ్య, మండల ఉపాధ్యక్షుడు గగ్గుటూరి మౌలాలి, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి లాయర్ రామదాస్, పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సుధామణి, లీగల్ సెల్ అసెంబ్లీ అధ్యక్షుడు కొమ్మినేని వెంకటసుబ్బయ్య, వాణిజ్య విభాగం పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఉన్నం కిరణ్ కుమార్, న్యాయవాది ఆదినారాయణ పాల్గొన్నారు.

'అన్నదాతలకు అండగా నిలుద్దాం'



కొండా నరేంద్రను సన్మానిస్తున్న రైతులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పిటిఎం మండల పరిధిలోని ముడమూరు పంచాయతీ కొండా ఫామ్స్‌లో ఆదివారం అధునాతన వ్యవసాయంపై రైతు శిక్షణా శిబిరాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త కొండా నరేంద్ర ఏర్పాటు చేశారు.ఈ రైతు శిక్షణ శిబిరానికి ముఖ్యఅతిథిగా రాజంపేట పార్లమెంట్ టిడిపిఅభ్యర్థి సుగువాసి బాలసుబ్రమణ్యం విచేశారు. ఈ సందర్భంగా కొండా నరేంద్ర మాట్లాడుతూ దేశానికి రైతు వెన్నెముక రైతులు నష్ట పోకుండా చూడటమే ప్రధాన లక్ష్యమన్నారు. రైతులు ఏపంట వేసినా కూడా నష్టపోతున్న తరుణంలో రైతులు నష్టపోకుండా సాంకేతిక వ్యవసాయం కొత్త పంటల గురించి ప్రముఖ వ్యవసాయ నిపుణులను ఆహ్వానించి రైతులకు ప్రత్యేక అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులను ఆదుకోవడానికి ఏ ప్రభుత్వం ముందరకు రావడం లేదని,కేవలం రైతులను ఓటింగ్ మిషన్లుగా మాత్రమే పరిగణిస్తున్నారని ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలపై పరోక్ష విమర్శలు చేశారు. ఒకరు బెంగళూరు మరొకరు పుంగనూరు అంటూ ఎద్దేవా చేశారు. ఏరోజు కూడా రైతుల పక్షాన నిలబడి మాట్లాడింది లేదంటూ రైతులకు ఎలాంటి ప్రయోజనాలను చేకూర్చలేదని విమర్శించారు. బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ భవిష్యత్తులో వ్యవసాయాన్ని ఉపాధి హామీతో అనుసంధానం చేసే ప్రక్రియ గత 15 సంవత్సరాల నుంచి కార్యరూపం దాల్చలేదని అన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే వ్యవసాయానికి ఉపాధి హామీతో అనుసంధానం చేయడానికి పార్లమెంటులో రైతుల తరపున పోరాడి ఉపాధి హామీకి వ్యవసాయాన్ని అనుసంధానం చేయిస్తామని చెప్పారు. తంబళ్లపల్లె జనసేన ఇన్‌ఛార్జి పోతుల సాయినాథ్ మాట్లాడుతూ తంబళ్ళపల్లి ప్రాంతంలో 90 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని,వీరికి కొండా నరేంద్ర వ్యవసాయ నిపుణులను పిలిపించి రైతులకు వ్యవసాయంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం అబినందనీయమన్నారు. కార్యక్రమంలో రైతులు,వ్యవసాయ నిపుణులు పాల్గొన్నారు.

'సిఎం, ఎమ్మెల్యేలను విమర్శించే స్థాయి లేదు'

ప్రజాశక్తి-నందలూరు



సమావేశంలో మాట్లాడుతున్న అన్నం నాగేంద్రమూర్తి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే మేడా మల్లికార్జున్‌రెడ్డిని ఏక వచనంతో మాట్లాడుతూ విమర్శించే స్థాయి విజయ్‌శేఖర్‌రెడ్డికి లేదని వైసిపి మండల అధ్యక్షులు అన్నం నాగేంద్రమూర్తి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డికి తిరిగి వైసిపి ఎమ్మెల్యే టికెట్ దక్కడంతో ఓర్చుకోలేక కనీసం టిడిపి కండువా కూడా కప్పుకొని నీకు టిడిపి టికెట్ వస్తుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కి.శే. ఎన్.టి.రామారావును వెన్ను పొడిచి పార్టీని లాక్కున్న చరిత్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుదని ధ్వజమెత్తారు. సొంతంగా పార్టీ పెట్టి తన చరిష్మాతో 151 ఎమ్మెల్యే సీట్లు, 22 ఎంపీ సీట్లు గెలిపించుకున్న స్థాయి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డినది అన్నారు. తండ్రితో సమానులైన అన్న మేడా మల్లికార్జున రెడ్డిని చేతకాని ఎమ్మెల్యే అని మాట్లాడడం సరికాదన్నారు. నాయకులు నరసయ్య, జిల్లా యువ నాయకులు పల్లె గ్రీస్మంత్ రెడ్డి లు మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడా వల్లే నీకు గుర్తింపు వచ్చిన విషయం మరచిపోవద్దని అన్నారు. ఇప్పటికైనా రాజకీయ డ్రామాను మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ మెంబర్ కలీం, పాలగిరి సుధాకర్ రెడ్డి, పెనుబాల నాగసుబ్బయ్య, అరిగే నాని, కాకిచంద్రపాల్గొన్నారు.




బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాసులు

బండలాగుడు పోటీల్లో ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సంక్రాంతి సంబరాల్లో భాగంగా రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎద్దుల బండలా పోటీలకు ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు ప్రారంభించారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో బండలాగుడు పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 ఎద్దుల జతలు పోటీలకు హాజరయ్యాయి. ఎద్దుల యజమానులను శాలువా, మెమోంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలలో భాగంగా రెడ్డి సేవా సమితి వివిధ సాంప్రదాయ, క్రీడా పోటీలను నిర్వహించామని పేర్కొన్నారు. అన్ని పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు అందిజేస్తున్నామని తెలిపారు. ఎద్దుల బండలాగుడు పోటీలలో ప్రథమ బహుమతి రూ.1లక్ష, ద్వితీయ బహుమతి రూ.75వేలు, తృతీయ బహుమతి రూ.50వేలు, 4వ బహుమతి రూ.30వేలు, 5వ బహుమతి రూ.20వేలు అందిస్తామని చెప్పారు. ఈ నెల 13న బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, సహాధ్యక్షులు టి.తిమ్మారెడ్డి, సమితి అధ్యక్షులు కె.నాగిరెడ్డి, నాయకులు ఆశోక్‌రెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, జి.వెంకటరెడ్డి, ఆదినారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, రాఘవరెడ్డి, దాతలు రామసుబ్బారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



పుత్తా నరసింహారెడ్డికి బోకే అందజేస్తున్న సలావుద్దీన్

మతసామరస్యానికి ప్రతీక పండుగలు

సంఘసేవకులు సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్

మతసామరస్యానికి ప్రతీక పండుగలని ప్రముఖ సంఘసేవకులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. ఆదివారం ముస్లిం సోదరులకు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి సంక్రాంతి విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సలావుద్దీన్ మాట్లాడుతూ కుల,మతాలకు అతీతంగా పండులు జరుపుకోవడం హర్షణీయమని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప

ఈనెల 19 న విజయవాడలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతి వనంలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కడప జిల్లా నుంచి ప్రజలు, పార్టీ నాయకులు, అభిమానులు, ఎస్‌సి సెల్ నాయకులు పెద్ద ఎత్తున హాజరై ప్రదం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు నగర మేయర్ సురేష్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌సి సెల్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు సంబంధించిన వాందరూ హాజరు కావాలన్నారు. జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ భారతరత్న అంబేద్కర్ భారతదేశ చరిత్రలో రాజ్యాంగ సృష్టికర్తగా నిలబడ్డారు అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ, అతిరథ మహారధులు, వైసిపి సీనియర్ నాయకులు అఫ్జల్ ఖాన్, సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్‌కుమార్ జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, కార్పొరేటర్లు .కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

- కందుల గ్రూప్ విద్యా సంస్థల కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనకు కషి చేసి తల్లి తండ్రులకు, కళాశాలకు కీర్తిని తీసుకురావాలని .కందుల గ్రూప్ విద్యాసంస్థల కోశాధికారి, సెక్రెటరీ, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ పిలుపునిచ్చారు. కెఎల్‌ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఘనంగా 70 వ కందుల రాజేశ్వర్మ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఓపెన్ ఆడిటోరియంలో కలశాల కల్చరల్ విభాగం వారి ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థుల మధ్య కేక్ కట్ చేశారు. విద్యార్థులు, కళాశాల సిబ్బంది పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాతమూర్తీ పుట్టిన రోజు పురస్కరించుకొని 'కలియుగం పట్టణం' సినిమాలోని 'జో జో లాలి అమ్మా' అనే పాటను చిత్ర నిర్మాత డాక్టర్.కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), దర్శకులు రమా కాంత్ రెడ్డి, రామా క్రియేషన్స్ ప్రొడ్యూసర్ జీ.మహేశ్వర్ రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ అభి,హీరో విశ్వ కార్తికేయ మాతమూర్తి పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా ప్రోమో ఆడియోను విద్యార్థుల మధ్య వారికే అంకితం చేస్తూ ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్ ప్రకాష్ రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ అభీ, కే ఓ ఆర్ ఎం ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ వెంకట శివారెడ్డి, సెక్రెటరీ లికిత రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, కే ఎల్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వి రత్నమ్మ, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ పి.ప్రేమ్ కుమార్, వివిధ విభాగాదిపతులు, డీన్ లు, స్టూడెంట్ క్లబ్ కోఆర్డినేటర్ లీనా రాస్తాపూర్, కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ బీ.వీర శంకర్, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



పుట్టినరోజు వేడుకల్లో రాజేశ్వరమ్మ



విద్యార్థులకు మెమొంటో, ప్రశంసా పత్రాలు అందిస్తున్న జెవివి నాయకులు

రాష్ట్ర స్థాయి చెకుముకి టెస్ట్‌కు 'రవిచంద్ర' విద్యార్థులు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక పట్టణంలోని రవిచంద్ర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఆప్తాబ్, ప్రణవిలు రాష్ట్రస్థాయి జెవివి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైనట్లు జెవివి మండల అధ్యక్షులు కాణాల శివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాయచోటి డైట్ కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి జెవివి చెకుముకి టెస్ట్‌లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ సైజుథామస్, సింటో ఇమ్మానుయేలు హర్షం వ్యక్తం చేశారు.

వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి-గుర్రంకొండ

రాష్ట్ర ప్రభుత్వం రైతుల వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయడం విరమించుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిపురి రామచంద్ర పేర్కొన్నారు. స్థానిక రైతు సంఘం ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని మర్రిపాడు, టి.రాచపల్లిలో విద్యుత్ స్తంభాలకు స్టిక్కర్స్ మీటరులను పరిశీలించి రైతులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. శ్రీ షిర్డి సాయికిచెందిన విద్యుత్ మీటర్లు స్థానిక విద్యుత్ స్తంభాలకు ఎలాంటి అనుమతులు లేకపోయినా ఏర్పాటు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. రైతు భరోసా కేంద్రాలు నిర్మించిన వారికి పెండింగ్ బిల్లులు ఇవ్వాలని కోరారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక చేసిన అప్పులు తీరక రైతాంగం విలవిలలాడుతుంటే ఇప్పుడు మళ్ళీ మీటర్లు బిగించడ దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు నష్టం కలిగించే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం ప్రభుత్వం ఉపసంహారణ చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బి.రమేష్‌బాబు, రైతులు మదనమోహన్ రెడ్డి, బాషా, కే భాస్కర్, సురేంద్ర పాల్గొన్నారు.

ఎస్‌టియు జిల్లా అధ్యక్షులుగా నరేంద్రనాథ్

ప్రజాశక్తి-పుల్లంపేట

రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా బీ.నరేంద్రనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 77వ వార్షిక సమావేశాలు మదనపల్లిలో ఎస్ఆర్‌కె కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగాయి. సమావేశం అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కేతరాజుపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బి.నరేంద్రనాథ్‌ను జిల్లా అసోసియేట్ అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. ప్రసాద్‌రెడ్డిని జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా, వల్లూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న శ్రీనివాసులును కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గం ఎన్నిక పట్ల మండల ఎస్‌టియు అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్, వి.సిద్దయ్య, ఆర్థిక కార్యదర్శి శివరాం హర్షం వ్యక్తం చేశారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రాజు

క్రీడలతో మానసిక ఉల్లాసం :'చమర్తి'

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

యువత ఉత్సాహంతో క్రికెట్ టోర్నమెంటులో పాల్గొని ప్రతిభను కనబరచడం అభినందనీయమని, క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని రాజంపేట టిడిపి పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. సిద్ధవటం మండలం, దిగువపేట గ్రామంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి సిద్ధవటం మండల పార్టీ అధ్యక్షులు జ్యోతి మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి దశరధరామనాయుడు, మాజీ జడ్‌పిటిసి చలమయ్యాయాదవ్, ఒంటిమిట్ట మాజీ ఎంపిపి లక్ష్మీనారాయణ నాయుడు, మండల యువనాయకులు రాజానాయుడు, బిసి నాయకులు గాలి సుబ్బయ్య, మాజీ జడ్‌పిటిసి లక్ష్మీదేవి, మాజీ మహిళా అధ్యక్షురాలు సువార్తమ్మ, పార్లమెంట్ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు 'మానవత' చేయూత

ప్రజాశక్తి-చిట్వేలి

అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున ఆదివారం మానవత స్వచ్ఛంధ సేవాసంస్థ చిట్వేలిశాఖ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. కేన్సర్‌తో బాధపడుతున్న అనుంపల్లికిచెందిన మాధినేని చంద్రశేఖర్, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిట్వేలికి చెందిన ఆవుల జయమ్మలకు పదివేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారికి మానవతా దృక్పథంతో సాయం అందించామని తెలిపారు. అభాగ్యులను ఆదుకునేందుకు దాతలుసహకరించి ఆదుకోవాలని తెలిపారు. సృష్టిలో మతాలన్నిటిలో కల్లా మానవత్వం ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు సాయిరాం, కార్యదర్శి మునిరావు, మానవతగౌరవ డైరెక్టర్ బోర్డుసలహాదారులు విశ్వనాధం, శ్రీనువాసులురెడ్డి, కోశాధికారి వీరాంజనరాజు, ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, రోళ్ళ మొహన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-కలకడ

మద్యం బాటిళ్లలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.మండలంలోని కదిరాయచెరువు పంచాయితీ కదిరాయ చెరువుకు చెందిన రామిశెట్టి లక్ష్మీపతి రాయల్ ప్యాలెస్ క్వార్టర్ మద్యం బాటిళ్లు కలిగి ఉన్నట్లు గుర్తించిన తమ సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు.ఈ దాడులలో 15 రాయల్ ప్యాలెస్ క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని లక్ష్మీపతిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ప్రజాశక్తి-కలికిరి

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి చెందిన సంఘటన కలికిరిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మండలం లోని పల్లవోలు పంచాయతీ, తూర్పుపల్లి గ్రామంలో నివాసమున్న గుర్రంకొండ వెంకటేశు అలియాస్ వంశీ(19) శ్రీనివాస కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడని తెలిపారు. ప్రతిరోజు లాగే ఆదివారం వారి వ్యవసాయ పొలం వద్దకు వాకింగ్ వెళ్ళి ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ వారి పొలం వద్దకు వెళ్ళగా బండపై మృతి చెంది ఉండటాన్ని గుర్తించారని తెలిపారు. మృతుడి తండ్రి గుర్రంకొండ కృష్ణమూర్తి పోలీస్ స్టేషన్‌లో తన కుమారుని అనుమాస్పద మృతిపై ఫిర్యాదు చేశారని చెప్పారు. ఎస్ఐ ఎస్ కె.రహీముల్లా ఆదేశాలపై హెడ్ కానిస్టేబుల్ జె .రఫీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎఎస్ఐ మధు సూదనాచారి తెలిపారు. అనంతరం సంఘట స్థలాన్ని వాయల్పాడు సిఐ సురేశ్ కుమార్ సిబ్బందితో కలిసి పరిశీలించినట్లు పేర్కొన్నారు.